# యెవరి కంపు వారికింపు

## 1

మాధవమ్మ గోవిందమ్మ పెత్తనాలకి బయలుదేరారు. ఇద్దరికీ తిరుబాటెక్కువ, బంధువులను చూసి వచ్చి, వాళ్ళను గురించీ, వాళ్ళ యింటి సంగతుల గురించీ మాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ, ఆడిపోసుకుంటూ, పొద్దు పుచ్చుకోటం యిష్టం. పండగనాడూ పాత మొగుడేనా అని సామెత. యెప్పుడూ స్వంత ఘోషేనా అని విసుగు, పరాయి యింటి విషయాలు రంజుగా ఉంటాయి నవ్వుకోవచ్చు.

దుర్గ గుడికెళ్ళి అమ్మవారి దర్శనం చేసుకుని దాయాది అప్పకూతురింటికెళ్ళారు. పడమటి లంకలో వాళ్ళిల్లు. కాలవ దాటి బల్లచెక్క యెక్కి బందరుకాలవ దాటి యిసకలో నడిచి వెళ్ళారు.

అప్పకూతురు సరస్వతి వీరిద్దరినీ అల్లంత దూరాన చూచి చెయ్యి వూపుతూ ఆప్యాయంగా పిలిచింది.

రండే అక్కయ్యా! యెన్నాళ్ళైందే మిమ్మల్ని చూసీ, నేనే వద్దామంటే వీలుపడలేదు. పనితో పొద్దూకుతున్నది. తెల్లారుతూనే పనీ, మునగానాం తేలానాం. ఒకదాని తర్వాత ఒకటి ఊరగాయలు పెట్టటంతో హైరాను. అప్పడాలూ, వడియాలూ పెట్టేప్పటికి రెక్కలు విరుగుతై. కూరలు రుచీ పచీ లేవు. అలా అరుస్తు యెదురెళ్ళి లోపలికి తెచ్చింది, కాళ్ళు కడుక్కోటానికి నీళ్ళిచ్చి, వేడివేడి కాఫీ యిచ్చింది.

ఇప్పుడెందుకే అమ్మన్నా! కాఫీ తాగే బయలుదేరాము, కాళ్ళలో బలం లేకపోయినా, యింట్లో కూచునీ కూచునీ విసుగెత్తి

పోతుంది. తరానికి తరానికి యెంత తేడా అమ్మన్నా, అచారాలు మారిపోయె, పెద్దా పిన్నా, అనే తారతమ్యం గమనించటం యేనాడో పోయింది. కొడుకులు కోడళ్ళూ గుడుగుడుమని గదిలో యేదో మాట్లాడుకుంటారు. మనుమలూ మనుమరాండ్రూ సరేసరి. అవేం చదువులో, పెళ్ళీడు దాటుతున్నా పెళ్ళి పేరెత్తరు. స్నేహితులూ, సినిమాలూ, అదేదో టివిట, అది చాలక దానికేదో అతికిస్తే మరో చిత్రం. మా కాలంలో అని తల ఆడించింది.

మాధవమ్మ నేలమీద కూచుని కాళ్ళు జాపి, రాచుకుంటూ అన్నది.

ఈవిడకు నోరు మూతపడదే అమ్మన్నా, వాళ్ళ కాలంలో లంకాదహనం, శ్రీరామ జననం అంటూ చాలా చెప్పి పూరుకోక, మా నాయనగారు అని స్వంత ఘోష మొదలెట్టి అదయాక, కాలం యెంతగా మారిందీ, అవేం డాన్సులూ వాటికర్థమున్నదా? అవేం పాటలూ, ఆధ్యాత్మ రామాయణమూ, గీత గోవిందమూ, తరంగమూ? అంటూ చాదస్తం బైట బెడుతుంది. అంతటితో అయిపోయిందీ? భగవద్గీత పాటగా నేర్చిందిట అది అందుకుంటుంది. వృక్షాలలో కెల్ల విశేషమైన అశ్వర్థవృక్షమ్ము నేనే కిరీటీ, మాసాలలోకెల్ల విశేషమైనా మార్గశిర మాసమ్ము నేనే కిరీటీ అని పాడుతుంది. మనుమలూ మనుమరాళ్ళూ గెంతుతూ నవ్వుతూ, ఆపేయ్ మామ్మా! ఆపేయ్ అమ్మమ్మా! అని అరుస్తారు. ఆపేయక రుక్మాంగద చరిత్రా ఏకాదశీవ్రతం అందుకుంటుంది. కట్టుపెట్టిన బొజ్జాకూ, ఖర్జూరాము లూ మంచీ నటనాలూ, టెంకాయలూ మంచి పాయసాన్నములూ, పుట్ట తేనెలూ, మంచీ ఖూరెలూ ఉండ్రాళ్ళు, ఘంటు ఘంటుకూ

నరికినా, ఖండించినా చెరుకులూ, ఒంటిగా భుజియించవయ్యా! గణనాయికా! అప్పుడు రుక్మాంగద మహారాజు కొలువుకు వచ్చె నటా యెటువలె నుండెనూ.

మాళవినేపాళ మళయాళ దేశాలేలుచు రుక్మాంగుధరుడు భూపాలుడొకనాడూ, తన మదిలో వున్నతనము వేడుకలా, చికిలిజాజులవిరులు సిగనిండ జట్టీ, ఠీన్నగా నుదుటిపై తిలకంబు తీర్చి, ఠీవి మించిన రుచుల రుమాలు చుట్టీ, చతురుపాయులైనా, చతురులైనా మంత్రులూ అతివేగా వత్తురే భూపాతి కొలువుకూ!

అపుడు సంధ్యావళీదేవి కొలువుకు వచ్చెనటా యెటువలె నుండెనూ, శుక్రుని ప్రభకన్న చక్కనై యున్నా ముక్కర ధరియించె ముద్దులు గులుకా?

పిల్లలు బుర్రకథ బుర్రకథ అని అరుస్తు చుట్టూ గెంతి వినకుండా పారిపోతారు.

అప్పుడు చేసేది లేక ముక్కి మూలిగి, యేం పిల్లలూ! అని స్నానానికి పోతుంది అని నవ్వింది గోవిందమ్మ.

సరస్వతమ్మ నవ్వుతూ వంటకుపక్రమించింది. అలాగ్గా వంట కానిస్తున్నది. కర్రల పొయ్యే, సర్వికట్టెలు, చక్కగా మండుతున్నాయి, వంకాయ కూర, ఇంగువపోపు ఘుమఘుమలాడుతూ వాసన వస్తున్నది. కందివచ్చడి రుబ్బింది, చారూ, అన్నం వార్చి మంట తగ్గించింది. వీళ్ళ మాటలు వింటూ నవ్వుతున్నది.

అమ్మమ్మా! డాన్సు స్కూలు నుంచి నడిచి వచ్చాం.

బస్సు అందలేదు. పొద్దైందేమో, కాళ్ళు పీక్కుతున్నై, ఆకలి అని నేలమీద కూలబడ్డారు పిల్లలు.

వాళ్ళిద్దరికీ కాఫీ గ్లాసులిచ్చింది సరస్వతమ్మ. చక్కిలాలూ జంతికలూ వున్న గిన్నె అందించింది. వాళ్ళు కాఫీ తాగి గ్లాసులక్కడుంచి, గిన్నెతో వెళ్ళిపోయారు. అయిదు నిమిషాలు కాలేదు, మనుమలొచ్చారు.

అమ్మమ్మా! కోచింగ్ సెంటర్నుంచి వచ్చాము. పరుగెత్తుకొచ్చాము. అల్లర్లు జరుగుతున్నాయి, రాళ్ళు రువ్వుకుంటున్నారు. పోలీసులు లాఠీఛార్జీ చేస్తున్నారు. వేము తప్పించుకొచ్చాము, అన్నం తినమా? పళ్ళేలు తెచ్చుకోమా? అన్నారు.

అప్పుడే యేమన్నమరా! అరన్నా కాలేదు అని అర గ్లాసు అరగ్లాసు కాఫీ, చేగోడీలుంచిన పళ్ళెం అందించింది సరస్వతి.

వాళ్ళట్లా వెళ్ళారు, అల్లుడొచ్చాడు.

వాళ్ళకట్లా కాఫీలూ, చిరుతిండీ అలవాటు చేయద్దంటే వినిపించుకోరేం. ఇలా అయితే పొలాలు అమ్మాల్సి వస్తుంది అని విసుక్కున్నాడు.

"ఆకస్తకే పొలాలు అమ్మటం? వంట అవుతున్నది. అర గ్లాసేగా మహా అయితే పావలా యేమో. రోజూ యిస్తున్నానా మా వాళ్ళొచ్చారని చేశా కాఫీ. రోజూ వస్తున్నారా మావాళ్ళు? యీ గుక్కెడు కాపీకోసమే వస్తారా? మీరు సినిమాలకి పెట్టుబడి అని దోసిళ్ళతో వరాయివారి చేతుల్లో పొయ్యటం లేదూ? రెండు పూట్లా వండి వార్చి వడ్డించి, యెంగిళ్ళు నీసేస్తుంటే అమాత్రం

అధికారం ఇవ్వరా నాకూ? నే పోతా మా అమ్మ పెద్ద ముండయి తానే వండుకు తింటున్నది. కూతురై పుట్టి సాయం చేయొద్దా? మీరే చూసుకోండి అన్నదమ్ములూ, అప్పచెల్లెళ్లూ అని లేచింది సరస్వతి.

అల్లుడు నిలబడేవున్నాడు. "చూశారండీ! దూబరా చేయద్దంటే తప్పయింది. ప్రయాణం కట్టారు అత్తగారు. రైళ్ళ ఖర్చులు మావే. వెళ్ళిపోయినారంటే బతిమాలి తెచ్చుకోవాలి. తన ముద్దులకూతురు చేయులేదనీ అల్లుడు కర్కోటకుడనీ, పైసా వదలడనీ మహా లోభి అనీ, వంట మనిషిని పెట్టడనీ, తాను చేస్తుంటే అడ్డుపడి తరిమేశాడనీ, చాలా అభాండాలు నా నెత్తినే స్తారు. అత్తగారి తల్లిగారు పెద్దత్తగారు నమ్ముతారు గూడాను" అని చేతులాడిస్తూ అంటున్నాడు.

కూతురు కుముదిని వచ్చింది. జలుబు, యెగబీలుస్తున్న వేలుతో ముక్కుకింద అడ్డంగా నెట్టుతున్నది. 'అమ్మా! స్టుడియోలో నౌకరు వచ్చాడు. ఇల్లు చిమ్మి, పక్కలువేసి, కూరలు తెచ్చి అక్కడుంచాడు. అన్నం పడేస్తే వెళ్లిపోతాడుట. స్టుడియోలోనూ పనిచేయాలిట, మద్యాహ్నం మిగిలిన అన్నం వేయనా' అంటూ పళ్లెం తెచ్చింది.

'సరస్వతమ్మ పళ్ళెంనిండా అన్నం కురుళ్లు పెట్టి పచ్చడీ కూరా, ఊరగాయా వేసింది.

కుముదిని విస్తరందుకుని పళ్ళెం పట్టుకుని వరండా వేపు వెళ్ళింది. అల్లుడు చెపుతూనే ఉన్నాడు, వాళ్ళ పద్దక్క రాజా మణీ వచ్చింది.

'చుట్టాలొచ్చారే తమ్ముడూ! అన్న సత్రం యథావిధిగ సాగుతున్నదా? అని వెటకారం చేస్తు యెత్తుజీట లాగి దానిమీద కూచున్నది.

కుముదిని గ్లాసు కిందపెట్టి చల్ల పొయ్యమన్నది.

'యెందుకే కుముదం ఉమ్మేస్తున్నావు? యేం పుట్టిందే నీకూ? అని మోటసరసమాడింది

గోవిందమ్మ అడిగింది "బిడ్డకి యాడాది వెళ్లిందీ? పాలు వదిలాడూ? నడక వచ్చినట్టున్నదే కుముదం సాష్టనం చేయ లేదూ?' అంది ప్రేమగా చూస్తు

'అ, అ. కొడుక్కి యాడాది వెళ్లింది పుట్టినరోజు పండగ చేసిందిగా కొడుక్కి- నామరదలు చాలా గొప్పదండీ, కొడుక్కీ కొడుక్కీ మధ్య స్నానమక్కర్లా అలాగ మరొక కొడుకుని కనే స్తుంది- ఇప్పటికి తెలిగ్గ పంచ పాండవులనీ కూతురునీ కందిగ యేమే మరదలా! అబద్ధమాడానా' అనడిగిండి

కుముదుని వచ్చి పళ్ళేలూ, గ్లాసులూ పెడుతుంది

కుముదుకి కోపం వచ్చి, నాకేంపుట్టలా, బాగానే ఉన్న మీ అమ్మాయికే తెగులు పుట్టింది. తల్లి ఉస్తి ఆమె బతికుండగనే తన పేర పెట్టాలిట అందుకే మొగుడు తోలితే వచ్చింది. మా కాస్తులూ లేవు దావాలూ లేవు అన్నది. కళ్ళు యెర్రబడినై.

దానిమీద అడపడుచు అరవసాగింది. ఈ లోపల అల్లుని తమ్ములిద్దరూ, ఒక చెల్లెలు, రెండో అక్క కూతురూ వచ్చారు. దీపాలు వెలుగుతున్నాయి

అందరికీ వడ్డన చేసింది సరస్వతమ్మ కాళ్ళూ చేతులూ కడుక్కొని వచ్చి పళ్ళేల ముందు కూచున్నారు

అల్లుడు భోగిందా్రి కూచున్నాడు తిన సాగారు

అక్కా! చారూ, కూరా బాగున్నాయి, అమృతం రా! నువ్వు కూడా తిను విస్తరి తెచ్చుకో యింటికెళ్లి కారం మెతుకు లేగా తింటావు కంది పచ్చడి యెంత రుచిగా ఉన్నదీ అన్న మంతా పచ్చడితోనే తినేయొచ్చు అంటున్నాడు భోగింద్రి

ఇంతలో మేనల్లుడొకమ్మాయిని వెంటబెట్టుకొచ్చాడు అది చూసి రాజామణి లేచి కొడుకు రెక్క పట్టుకొని బరబరా వరండా లోకి లాక్కెల్లింది

"ఇక్కడుండండిర నువ్వు నీ గళ్ ఫ్రెండ్ కూచోండి లోప లికి తేవద్దని యెన్నిసార్లు చెప్పిన గుర్తుండదేంర నీకూ! అని విసుక్కున్నది లోపలికెళ్ళి రెండు పళ్లేలు కింద వుంచింది

నాకు పెట్టదలచిందీ ఆపళ్లేలలో వడేయండి నేనింకావంట చేయలేదు వెళ్లి చేయాలి" తానే వెళ్లి చల్లగిన్నె తెచ్చి రెండు గ్లాసుల్లో పోసింది

సరస్వతమ్మ వేడివేగా అన్నీ పళ్లేలలో వుంచి చారు గిన్నెలు రెండుంచింది రాజామణి అవి తీసికెళ్లింది కుముదుని చారూ, చల్లా యిచ్చివచ్చింది

సరస్వతి ముక్కు పుటాలు కదిలిస్తు మూతి విరుస్తు, తల తాటిస్తు మళ్ళా పొయ్యిమీద గిన్నె యెక్కించింది వంకాయలు కూర తరిగింది

మాధవమ్మ గోవిందమ్మ సాయపడ్డారు. బియ్యం కడిగి ఇచ్చారు. పచ్చడి రుబ్బారు. అప్పడం, వడియం కుంపటిమీద వేయించారు.

కారేజీలో అన్నం సద్ది కూరా పచ్చడీ చారూ వుంచి కుము దిని అడపడుచుకందించింది. ఆమె విసుక్కుంటూ వెళ్ళింది, బాండీలో నూనె మరుగుతున్నదని మళ్ళా అప్పడం వడియం వేయించారు.

భోగిందర్రి తినటమైంది, చెయ్యి కడుక్కొని తుడుచు కుంటూ వచ్చాడు. కుముదం! బీరువా తాళాలేవీ? పోవాలి అన్నాడు.

డబ్బు లేదండీ, తాళాలెందుకూ? నిన్న నేగా యెండలో కోర్టుచుట్టూ లాయర్లచుట్టూ తిరిగి డబ్బంతా ఖర్చు చేసుకుని వచ్చారు. మీ అప్పగారూ వినరు, ఆమె అల్లుడూ వినడు. మీరు యెండన బడి అందరిచుట్టూ తిరగటం దండగ అంటే విన్నారా? అని తాళం చెవులగుత్తి విసిరేసింది. అతని పాదాల ముందు పడిందా గుత్తి.

నీకూ అసహనం పెరిగిపోతున్నది, నీ తల వెర్రితల లేస్తున్నది, ఆస్తి నిలవద్దూ? బావకు పెరాలిసిస్ వచ్చింది, జాబ్ చేయలేడు, కొడుకు అందిరాలేడు. మా అక్క గతేమిటి? ఆమె అంతా కోల్పోతే దాన్నీ కుటుంబాన్నీ యింటికి తెచ్చేసు కోవాలి, పోరాడాల్సిందే, అడ్డు చెప్పే స్తోమత ఉన్నదా నీకు? తాళాలు విసిరేస్తావా? అని భార్య నెత్తిమీద రెండు దెబ్బలేశాడు.

సరస్వతమ్మ పొయిలో కట్టెలాగి పట్టుకుని, కూతురుమీది

కెళ్ళింది. సిగ్గు లేదేమే కుముదం, కృష్ణలో బడి చావరాదుటే, వాత బెడ్తా, యెదురు చెప్పద్దని యెన్నిసార్లు చెప్పను? గుర్తుండదేం నీకూ? తగలేసుకోని, ముష్టెత్తుకుంటారు? నామోషీ యెందుకూ?

అల్లుడి తమ్ములు అత్తగార్ని అవతలికి లాక్కెళ్ళారు.

యెదురు తిరిగి నాలుగు తన్నాలి వదినగారూ! మళ్ళా చెయ్యి చేసుకోడు మా అన్న. మీకు మార్షల్ ఆర్ట్స్ నేర్పుతా మంటే నేర్చుకోర్రై పాయె అని పెద్దమరిది సరసమాడాడు.

పడి పూరుకోటమే మాకలవాటు. తనవారిచేత చీకట్లో తన్నించటం గానీ, తాను తిరగబడి నాలుగు తన్నటం గానీ అలవాటు లేదు అన్నది కుముదిని. కోపంతో కళ్ళు యింకా యెర్రబడి నీళ్ళొచ్చినై పమిటతో అద్దుకున్నది.

మా యింటి సంగతులన్నీ పరాయివాళ్ళ యెదుట బైట పెడతావా? బుద్ధీ జ్ఞానం లేదూ నీకూ? అని భోగీంద్ర మీదికి వస్తుంటే యీ మాటు పిల్లలు యేడుస్తూ వచ్చి తండ్రిని లాక్కెళ్ళారు.

సరస్వతమ్మ యేడుస్తుపోయి దొడ్లో తులసికోట ముందు కటికనేలమీద కొంగు మొహానేసుకుని పడుకుని "నే చూడలేను, నన్ను పోనివ్వరు. నా కూతుర్ని నా యెదుట చెయ్యి చేసుకోట మేమిటి? దాన్ని వదిలేసి ఆస్తంతా వాళ్ళ వాళ్ళ కిచ్చుకుంటే సరిపాయెగా. యెవరింట్లో వంటచేసినా, నా బతుకు తెల్లారి పోతుంది. వీళ్ళింట్లో యెందుకు చేయాలీ? అని యేడుస్తున్నది.

మాధవమ్మ గోవిందమ్మ అంతా సద్ది శుభ్రం చేసి, అందర్నీ సముదాయించి పంపి సరస్వతమ్మను లేవదీసుకొచ్చి, ఆమె పక్షం మాట్లాడి, తమ మధ్య కూచోబెట్టుకుని అన్నం తినిపించారు.

కూతుర్ని వదిలి వుండలేవే పిచ్చి కూతురా! మేమూ అంతేననుకో, యెంత తగవులు ఆడుకున్నా మాటలనుకున్నా, యెవరి కంపు వారికింపు అని, యెక్కడికి పోయినా యిల్లూ పిల్లలే గుర్తువచ్చి వచ్చేస్తాం అలా నవ్వించారు. భోజనాలైనై.

కుముదిని నవ్వుతూ అన్నది ఒక మంచి సీను వేశాం అమ్మమ్మా! పెద్దతనంలో మీరు సినిమాలు చూసి ఆనందించలేరు. మా యింటికి వస్తూ వుండండి. మా అమ్మ సంతోషిస్తుంది.

మాధవమ్మ నవ్వింది, పిచ్చి పిల్లా! అందరిళ్లల్లోనూ వున్నవే యీ గొడవలు, పదిన్నర దాటింది, మేం పోతాం, అన్నీ సర్దు గిన్నెలు మూల పడేశాం అన్నది.

కుముదిని పోయి భోగీంద్రతో చెప్పింది భోగీంద్ర షెడ్డులోంచి జీపు బైటికి తెచ్చి, అందులో యెక్కమని తోలుకెళ్లి వాళ్ల యిళ్లవద్ద దింపి వచ్చాడు.

## 2

శ్రీరామశాస్త్రి రామాలయంలో సాయంత్రం నాలుగున్నరనించీ పురాణ పఠనం చేస్తాడు. భక్తిగీతాలు పాడతాడు. యేదో భక్తితో గాక, కాలక్షేపానికి కాక, వినోదమూ, ఆసక్తి కలగాలని మనోజ్ఞంగా చెపుతాడు. వృద్ధులు నవ్వుతూ వింటారు.

మన యిళ్ళల్లో యిప్పటికీ దశరథులూ, కైకమ్మలూ దర్శనమిస్తూనే వుంటారు. రామాయణం కట్టుకథ కాదు. నిర్మోహత్వాన్ని, నిశ్చలతత్త్వాన్ని, సత్త్వగుణం కాపాడుకోవాలనీ, ఆచరించాలనీ వాల్మీకి మహర్షి రామాయణం గానం చేశాడు. తామరాకుమీద నీటిబొట్టులాగా వుండగలిగితే, మోక్షం కరతలామలకం. ముక్తి లభిస్తుంది. నేను చేశాను, చేస్తున్నాను అని ఆలోచించేకన్న, అంతా ఆ పరమాత్మ చేస్తున్నాడు అనుకోగానే బంధం తెగిపోతుంది అని చెపుతున్నాడు.

మంటపం చివరిగా స్తంభానికానుకుని, గోవిందమ్మ, మాధవమ్మా వింటున్నారు. గోవిందమ్మ గడ్డం కింద చెయ్యి ఆన్చి కాలుకి మోచేయి ఆనించి విచారంగా మౌనంగా చూస్తున్నది. వింటున్నట్టు లేదు. వూరికే చూస్తున్నది.

పోదామా గోవిందమ్మా! ఇవాళ మరీ మౌనంగా ఉన్నావే అన్నది మెల్లిగా, కొంగు దులిపి భుజానేసుకున్నది.

అంతకంటె మెల్లిగా గొణుకుతున్నట్టుగా గోవిందమ్మ అన్నది. నాకు నోటమాట రావటం లేదు మాధవమ్మా! అది యిల్లా సంతా! వీధి బజారా! చాపల మార్కెట్టా అనిపిస్తుంది. సద్ది చెప్పబోతే నోరు మూయించేస్తారు. 'రామాకృష్ణా అనుకో, నీ రుద్రాక్షల తావళమేదీ, జపం మానేశావా? పురాణం వినటానికెళ్ళవూ? టైమైనట్టుందే, గుడికి తీసికెళ్తాం రా. నేను సైకిల్ మీద తీసికెళ్ళి దింపుతా రా మామ్మా! నా స్కూటర్ మీద తీసికెళ్తా రా! నువేగా కొనిబెట్టావూ?' అని పరాచికాలాడుతారు. యేబ్బే అదేం సంసారం, పూజా పునస్కారాలు లేవు. ఇంత

రుచిగా వండిపెడదామనీ లేదాడపిల్లలకి. డిగ్రీలూ, ఉద్యోగాలూ, మీటింగులూ, వినోదయాత్రలూ, పాదయాత్రలూ, స్త్రీల హక్కులూ అని ఊరిమీద తిరగటమేసైపాయె, పసికూనలు కక్కటిల్లిపోతారేమో అనన్నా లేదు, ఇంటి ధ్యాసే వుండదు. వచ్చినా ఒకళ్ళమీద ఒకళ్ళు పడుతూ అపభ్రంశపు సంభాషణలూ. నే కలగజేసుకుంటినా "నీకు తెలియదూరుకో అమ్మమ్మా! ఇవాళ వాడి సంగతి తేలుస్తా, యెందుకు నా వెంట బడుతున్నాడో! పెళ్ళి మాటెత్తద్దుట అని తిట్లకు దిగింది మనమరాలు. యెందుకులే మాధవమ్మా! శాస్తుర్లుగారు చెప్పాడుగా, తామరాకుమీద నీటిబొట్టులాగా ఉండమంటున్నాడు, ఉండటం చాతగావటం లేదు, మనుమడు సరేసరి, దేశదిమ్మరిలాగా తిరిగి వస్తాడు, పెళ్ళాన్ని తెచ్చుకోవాలి, సినిమా తారలపాటి చేయలేదా అంటే, అది తంత్రిపక్షం మాట్లాడుతూ, తనవాళ్ళను వెనకవేసుకొస్తున్నది. దానికి గుణపాఠం నేర్పాలి అంటాడు. ఇల్లే వైకుంఠం, కడుపే కైలాసంట నాకు. ఇల్లు పట్టకుండా, ఒక్క క్షణం యింట్లో కాలు నిలవకుండా తిరిగే చివరికోడలంటుంది.

లే, పోదాం రా గోవిందమ్మా! ఇవాళ నాతో రా, రాత్రికి మినపరొట్టెలూ మజ్జిగేగా, అదుగో అసురసంధ్య వేళైంది. పురాణం ముగిసింది, దీపాలు వెలిగినై, గంట కొడుతున్నారు అని లేవదీసింది.

మెల్లిగా కుంటుతూ కర్ర పోటు వేసుకుంటూ మాధవమ్మ యింటికి చేరారిద్దరూ, వీధిలోకే గొల్లున గోల వినిపిస్తున్నది. ఆకాశంలో కాకి గోలా, మేడమీద నాలుగోతరం నాట్యమాడుతున్నారు. సంగీతం, వికటతాండవం వింతదీపం కంటబడినై.

ఇద్దరూ స్నానం చేసి పట్టుబట్టలు కట్టి, ధ్యానంచేసి ఫల హారానికి కూచున్నారు. మాధవమ్మ లేచి వెళ్ళి తన భర్త చేత మందు నాకించింది. నాటురవ్వతో చేసిన ఉప్పుడు పిండి, నిమ్మ ఊరగాయా తినిపించింది. హార్లిక్స్ తాగించింది. ఆయనకు యెండురోగం పట్టుకున్నది. మనిషి రోజుల పేరిట క్షీణిస్తున్నాడు, గుడికి వెళ్ళలేడు, పురాణం వినబడదు, స్నేహితులు లేరు.

మనుమడి పెళ్ళాం పార్వతి, ఫలహారం తయారు చేస్తున్నది. పెనం మీద మినపరొట్టె వేస్తున్నది. పార్వతి చివరి చెల్లెలు కృష్ణ యెనిమిదో యేడు వచ్చింది. అక్కను చూసి పోదామని వస్తే తనను గిల్లి వెక్కిరించి, కోతి అని గేలిచేసి యేడిపించారుట. అక్కతో నేరం చెపుతూ కళ్ళు నులుపుకుంటున్నది.

ఇంట్లో వున్న పిల్లలు వచ్చి, నువ్వు మా మామ్మ రొట్టెలు తినే సమయాని కెందుకొస్తావు రోజూ? అడ్డ తలకాయ, నీకు మీ అమ్మ కడుపునిండా అన్నం పెట్టక మాడుస్తుంది, తేరగా రొట్టెలు దొరుకుతాయని వస్తున్నావు అని నవ్వుతుంటే భరించలేక కృష్ణ వాళ్ళమీద కలియబడింది.

అల్లరి యెక్కువైంది, పార్వతి లేచిపోయి పిల్లల్ని విడదీసి తన చెల్లెల్ని లాగి బాదింది, కృష్ణ యింకా యేడిచింది.

పో, యింటికి పో. మళ్ళా వచ్చావంటే కాళ్ళు విరక్కొడతా అంటుండగా పార్వతి తల్లి కాంతమ్మ వచ్చి పిల్లను రెక్కపట్టి తీసికెళ్తూ సముదాయించింది.

ఒక రొట్టెముక్క కోసం యిన్ని మాటలు పడాలిటే కృష్ణా! నీకోసం అట్లు వేశాను తిందువుగాని. ఈ భాగ్యానికి కాళ్ళు గూడా విరక్కొట్టించుకోవాలీ? వాళ్ళ సొమ్ము పరాయి వాళ్ళకు యిచ్చుకోవాలి. నీకూ నాకూ యెందుకిస్తారే తల్లీ! భోషాణంలో నాగువత్తులు రెండూ యెలా నడిచిపోయాయో, యివాళ్టివరకూ తెలియలేదు. యెందుకు తేలుతుందీ? యింటి గుట్టు లంకకు చేటని పైకి పొక్కనీయరు అని కూతుర్ని లాక్కెళ్తూ వీధిగుమ్మం దాటి వెళ్ళిపోయింది.

పార్వతి మాడిన రొట్టె అట్లకాడతో యెత్తి దొడ్లో పారేసి వచ్చింది. మరో రొట్టె వేసింది, నెయ్యివేసి రెండు వేపులా వేయించి తీసి ఆకులో వుంచింది. అరటిపండూ చల్లగ్లాసూ, పక్కగా పెట్టి పెనం దింపటానికి వెళ్ళింది.

పార్వతీ! ఆ రొట్టె తీసికెళ్ళి నీ చెల్లెలుకియ్యి. వాళ్ళం దర్నీ తాకి వచ్చావు. ఈ రెండు రొట్టెలూ మా యిద్దరికీ చాలు అన్నది మాధవమ్మ.

పట్టు చీరేగా అమ్మమ్మా! యెట్లా మైలపడ్డానూ, వాళ్ళు కొట్టుకోటం మానలేదైపాయె అని మూతి విరిచి తల తాటించి, విస్తరీ రొట్టీ పట్టుకెళ్ళి అవు దగ్గరగా నిలబడి రొట్టె అంతా తినేసి, అరిటాకు అవుచేత తినిపించి వచ్చింది.

ఫలహారమైంది, మజ్జిగ తాగి పండు తిన్నారు. ఆకులు పారేసి చేతులు అద్దుకుని, కొంగున వున్న వక్కపొడి చెరి కొంచెం నోట్లో వేసుకున్నారు. వరండాలో కొచ్చారిద్దరూ, దీపం వెలుగుతున్నది, చాప పరిచి కూచున్నారు. తలెత్తి

చూస్తే గోడవారగా పాతికేళ్ళ మనుమడు పడుకుని గునుస్తూ మూలుగుతున్నాడు. అతనికి పోస్టాఫీసులో ఫామ్స్ నడిపే ఉద్యోగం. బొద్దుగా తెల్లగా వుంటాడు, పేరు రంగనాయకులు.

రంగా పోయి అన్నం తిను, వడ్డించేస్తున్నారు. యెని మిది దాటింది, నువ్వు మళ్ళా పోస్టాఫీసుకి వెళ్ళాలేమో, నీ బదులొచ్చేవాడు శలవు పెట్టాడంటివి అన్నది మామ్మ.

నేను తినను మామ్మా! యేదో యెత్తుకుపోయానని నాన్న నిందవేస్తు ఉంటాడు. ఆయన నోరు యెవరూ మూయించరు. రాములమ్మకి గాజులూ పూలూ కొనిబెట్టానుట, అదో తప్పైంది, అది నన్ను బస్‌స్టాప్‌లో చూడగానే పరుగెత్తుకొచ్చి యేడుస్తుంది చూడలేను, అయ్య కొట్టాడు అమ్మ బువ్వ పెట్టలేదు. ఇయాల కూడు లేదు, టీనీలే అంటే వినలేక యింటికి తెచ్చి అన్నం పెట్టి చాను, దొడ్లోనే పెట్టించాను. అయినా యిల్లంతా మైలపడిందట, అది మరో తప్పు, అందుకని దొంగవెధవ అయినాడు అని పెద్ద మనుషుల యెదుట అన్నాడు నాన్న.

తల్లి లక్ష్మీబాయమ్మ వచ్చింది, కొడుకును సముదాయిస్తు అన్నది, ఆమెకు పార్కిన్ సన్స్ డిసీజ్, వళ్ళంతా కదుల్తూ వుంటుంది. జరీ వున్న పట్టుచీరా రవికా, రవ్వల కమ్మలూ, యింకా నగలూ, కాళ్ళకు పాంజేబులూ, వేళ్ళకు ఉంగరాలూ, చేతులకు బంగారు గాజులూ.

నాయనా రంగా! లేచిరా. యే పాటు తప్పినా సాపాటు తప్పదు, అన్నం వడ్డించారు. నీ చెల్లెలు కాపురం గద్దలైంది.

రంభవంటి కూతుర్ని జులాయి మనిషికిచ్చారు. డబ్బూ పెద్ద ఉద్యోగం గలవాడని చూశారు. దానికి ఒక నలుసన్నా కలిగింది గాదు. బిడ్డను చూచుకునైనా సంతోషించేది. చిత్త చాంచల్యమని డాక్టరుచేత చెప్పి చితోలేశారు. గుండెల మీద కుంపటిలాగా వయసులోవున్న కూతుర్ని యెదురుగా పెట్టుకొని, మొగుడు పిలిస్తే వెళ్ళాలి నేను, నాన్నగారంటే అన్నారులే. పోతే పోయిన్నై, పోయింది పొల్లు, లేచిరా, నీకిష్టమైనవాళ్ళకి నీకిష్టమైనవిచ్చుకుందువుగాని. మేనగోడలని పెళ్ళిచేసి యింటికి తెచ్చుకుంటే దాని కడుపునా ఓ కాయ కాయలేదు, అని లేవదీసింది. రంగా కళ్ళు తుడుచుకుని లేచాడు, వాళ్ళిద్దరూ భోజనాల గదిలోకెళ్ళారు.

కూతురు సుగంధి జుట్టు విరబోసుకుని వచ్చింది. తడి తల ఆరలేదు, అందుకని ముడి వేయలేదు. మంచి రోజులు రావాలని పూజ చేస్తుంది, స్నానం చేస్తుంది. అందమైన విగ్రహం, జార్జెట్ చీరా జాకెట్టూ, కాసిని నగలూ, యెర్రని బొట్టూ, రవ్వ ముక్కుపుడకా, మనిషి చాలా యెరుపు.

నేను మీకందరికీ బరువుగా వున్నానా? అత్తవారికి బరువైనాను. యెదురింటి ఉద్యోగి పిలుస్తున్నాడు, పోనా. అన్నకున్న స్వేచ్ఛ నాకు లేదా? టైపు నేర్చుకోటానికి పోతానంటే పోనివ్వరు. అలా అంటూ మాధవమ్మవేపు వచ్చింది.

మామ్మా! నీకేమైనా అవమానమా? నేనెవరి పోలికా? నీ పోలికేనా? వృదనారీ పతివ్రతా అని యేమిటి పాడుతున్నావు? గోవింద నామాలా? అని పెద్దగా నవ్వుతూ వెళ్ళిపోయింది.

## 3

మాధవమ్మా! కాశీ రామేశ్వరాలు చూసొద్దాం రా, యాత్రలు చేయాలి అన్నది గోవిందమ్మ.

కాశీలో యేమీ లేదు, రామేశ్వరంలో యేమీ లేదు గోవిందమ్మా! కాశీ పోగానే కాశీ మలేరియా అని అంటుకుంటుంది. యాత్రిలలో దోవలో తినేవి పడక కడుపులో కురుపులేస్తుంది. మా పెద్దక్క యాత్రలు చేసివచ్చి, మాంచాన పడింది. మనమేం కోరుకోవాలంటే,

అనాయాసేన మరణం వినాదైన్యేన జీవనం। దేహం తే తవ సాయుజ్యం॥ ఇంట్లోనే వుండి, తామరాకుమీద నీటిబొట్టులాగా వుండి, అన్నీ ఆ పరమాత్మ చేస్తున్నాడనుకుంటూ, వీళ్ళను చూసి ఆనందిద్దాము. నవ్వుతూ నిదానంగా అన్నది మాధవమ్మ.

— ० —